## క్లుప్తంగా

### మర్యాదపూర్వక కలయిక



మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరితో వైఎస్సార్‌సీపీ నాయకులు

**దెందులూరు:** దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరిని శనివారం ఆయన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాటి సుధాకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు ఎదుర్కొంటున్న సమస్యలు వేధింపులు వివరించారు. కొవ్వలి గ్రామంలో పరిస్థితులపై అరగంటసేపు చర్చించారు. అబ్బయ్య చౌదరిని కలిసిన వారిలో పోలయ్య, గంటా పండు, నేటూరి సాయి తదితరులు ఉన్నారు.

### వైద్యానికి స్నేహితుల సాయం



సహాయం అందిస్తున్న కైకరం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

**ఉంగుటూరు:** పరిశ్రమలో పనిచేస్తూ గాయపడిన తోటి మిత్రుడి వైద్యానికి శనివారం కైకరం జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థులు సాయం అందించారు. కైకరానికి చెందిన బీఎస్‌వీ అప్పారావుకు స్థానికంగా ఉండే టైల్స్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న సమయంలో వెన్నెముకకు గాయమైంది. ఈ నేపథ్యంలో విషయం తెలుసుకున్న తోటి విద్యార్థులు అప్పారావు రూ.50 వేలు సాయం చేశారు. కార్యక్రమంలో కూన అప్పారావు, కమ్ముల నాగబాబు, మెట్ట వెంకటేశ్వరరావు, గనసల నాగరాజు, రుద్రరాజు శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

### చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

**ఉంగుటూరు:** మండలంలోని చేబ్రోలు గ్రామం ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని జిల్లాపరిషత్ సీఈఓ శ్రీహరి శనివారం పరిశీలించారు. అలాగే గ్రామంలోని పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి తడి చెత్త, పొడి చెత్త విడివిడిగా సేకరించాలని కోరారు. అలాగే విడిగా చెత్త ఇవ్వగలిగితే సంపద తయారీ కేంద్రంలో సెగ్రిగేషన్ చేయడం సులభం అవుతుందని ప్రజలకు అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య పరీక్షలు ప్రతి నెల నిర్వహించాలని సూచించారు. మాజీ సర్పంచి రందే రాజారావు, ఎంపీడీఓ మనోజ్, డిప్యూటీ ఎంపీడీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### నిర్దేశించిన సమయంలోపు రేషన్ పంపిణీ పూర్తి



రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

**పెదవేగి :** రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసరాల పంపిణీని నిర్దేశించిన సమయంలోపు నూరుశాతం పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి ఆదేశించారు. మండలంలోని కొప్పాక గ్రామంలోని రేషన్ షాపును శనివారం సాయంత్రం జేసీ ధాత్రిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ షాపులో జూలై నెలకు పంపిణీ నిమిత్తం తరలించిన సరుకుల నిల్వలను రిజిస్టర్ ప్రకారం ఉన్నాయా? లేవా? అనే విషయాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని పలువురు ఇళ్లకు వెళ్లి రేషన్ సరుకుల పంపిణీ విధానం గురించి ఆరా తీశారు. జూలై నెలలో మొదటి 5 రోజులలోనే 80 శాతానికి పైగా సరుకులను పంపిణీ చేయాలన్నారు. జేసీ వెంట ఏలూరు ఆర్డీఓ అచ్యుత్ అంబరీష్, తహసీల్దార్ భ్రమరాంబ తదితరులు ఉన్నారు.

### పీజీ సెట్‌లో ర్యాంకర్లకు అభినందన



ర్యాంకర్లను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) :** ఇటీవల విడుదల చేసిన ఏపీ పీజీ సెట్ పరీక్షల ఫలితాల్లో స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపరిచారని ప్రిన్సిపాల్ జి.గిరిబాబు తెలిపారు. ఎంఎస్సీ జువాలజీలో రాష్ట్ర స్థాయిలో కె.నవీన్ కుమార్ 16వ ర్యాంక్, సీహెచ్ జగదీష్ 245, షేక్ షారూన్ 354 సాధించారని పేర్కొన్నారు. ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో పి.చంద్రశేఖర్ 214, కె.మనోజ్ శ్యామ్ సాయి 249, జి.హేమ వెంకట సత్యనారాయణ 256 ర్యాంక్‌లు సాధించారని వివరించారు. వీరిని, వీరికి తర్ఫీదు ఇచ్చిన అధ్యాపకులు ఎం విజయ్ కుమార్, టీవీఎస్ దుర్గాప్రసాద్‌లను అభినందించామని తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్ల కోసం ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్న విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

# మూణ్ణాళ్ల ముచ్చటగా మరమ్మతులు



గోతుల్లో వర్షపు నీరు నిలిచి పేరుకుపోయిన బురద



గోతులతో ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

- చిన్నపాటి వర్షాలకే భారీ గోతులు
- మరమ్మతుల్లో బహిర్గతమైన డొల్లతనం



భీమడోలు జంక్షన్ నుంచి రైల్వే సంత మార్కెట్ రోడ్డు ఇలా



కంకర, చిప్స్ లేచి అధ్వానంగా ఉన్న రోడ్డు

**భీమడోలు:** నియోజకవర్గంలో రోడ్ల మరమ్మతులు మూణ్ణాళ్ల మారాయి. చిన్నపాటి వర్షాలకే భారీ గోతులు పడి రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. దీంతో లక్షలాది రూపాయలతో చేసిన మరమ్మతులు వృథాగా మారాయి. మూడు నెలల క్రితమే నిర్మించిన భీమడోలు జంక్షన్ నుంచి సంత మార్కెట్ వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ రోడ్డు (మినీ బైపాస్ రోడ్డు) చిన్నపాటి వర్షాలకే గోతుల పడి ప్రమాదాలకు నెలవుగా మారింది. రూ.10 లక్షలతో మరమ్మతులు చేసిన ఈ రోడ్డు ఇరువైపులా గోతులే దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రయాణికులు హడలిపోతున్నారు. రోడ్డుపై రాళ్లు లేచిపోవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం ముంచుకోవస్తుందోనన్న భయంతో బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్నారు. రోడ్ల నిర్మాణానికి పెద్ద పీట వేస్తున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలికి మరమ్మతులతో సరిపెట్టింది. మరమ్మతుల సమయంలో అధికారుల పర్యవేక్షణా లోపంతో ప్రస్తుతం రోడ్డు ఛిద్రంగా మారింది.

**శ్రీవారి సన్నిధికి వెళ్లాలంటే భయం..భయం**

జిల్లాలోని ప్రముఖ దేవాలయం ద్వారకాతిరుమల వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డుపై ప్రయాణించే ద్విచక్రవాహనదారులు, భక్తులు, వృద్ధులు, ప్రయాణికులు నరకయాతనను అనుభవిస్తున్నారు. భీమడోలు నుంచి సంత మార్కెట్ వరకు 3 కిలోమీటర్ల మేర నిర్మించిన ఈ రోడ్డు కనీసం రెండేళ్ల పాటు శాశ్వతంగా ఉంటుందని ప్రజలంతా భావించినా నాసిరకం పనుల వల్ల ఆ పరిస్థితి కానరావడం లేదని స్థానికులు చెబుతున్నారు. రాత్రి సమయంలో ఈ రోడ్డుపై ప్రయాణించే వారికి గోతులు దగ్గరగా వచ్చేంత వరకు కనిపించకపోవడంతో వాహనాలు అదుపు తప్పి గాయాల పాలవుతున్నారు. ఈ రోడ్డులోని గోతులను పూడ్చాలని ప్రజలు, భక్తులు, మహిళలు, వృద్ధులు కోరుతున్నారు.

**రాజులవీధిలోని రోడ్డు ఇలా**

అలాగే భీమడోలులోని జన్మభూమి పార్కు నుంచి రాజుల వీధి వైపుగా వెళ్లే రహదారి ఏన్నో ఏళ్లుగా అధ్వానంగా మారింది. ఎక్కడ చూసిన భారీ గోతులే దర్శనమిస్తున్నాయి. భీమడోలు మినీ బైపాస్ రోడ్డు నిర్మించక ముందు ఈ రోడ్డు వెంబడి రాకపోకలు సాగించే వారు. దీంతో రోడ్డు శిథిలావస్థకు చేరి పాడైంది. ఆ తర్వాత ఈ రోడ్డును పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో గోతులతో నిండిపోయింది. ఈ రోడ్డులో దుకాణాలు, కో–ఆపరేటివ్ బ్యాంకు ఉండడంతో ఈ రోడ్డుపై ఎక్కువ ప్రజలు సంచరిస్తున్నారు. అయినప్పటికీ రోడ్డుకు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. రోడ్ల పరిస్థితిపై ఆర్ అండ్ బీ ఏఈ జె.భాస్కరరావును వివరణ కోరగా మినీ బైపాస్ రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజ్ వ్యవస్థ లేకపోవడంతో వర్షాలకు రోడ్డుపై గోతులు పడతాయని, ఆ రహదారిని పరిశీలిస్తామన్నారు.

### పాఠశాలకు వాటర్ ప్యూరిఫయర్ అందజేత

**దెందులూరు:** దాతలు, స్వచ్ఛంద సంస్థలు పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించడం స్ఫూర్తిదాయకమని గోపన్నపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.మనోహర్ అన్నారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాలకు రూ.15000 విలువైన వాటర్ ప్యూరిఫయర్‌ను శనివారం పాఠశాలలో దాతలు అందజేశారు. కార్యక్రమంలో వాసవిక్లబ్ అధ్యక్షుడు ప్రభాకర్‌రావు, కార్యదర్శి సుబ్బారావు పాల్గొన్నారు.

### నేటి నుంచి పూళ్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**భీమడోలు:** పూళ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని మొక్కలు కటింగ్, విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా ఆదివారం నుంచి జూలై 2వ తేదీ వరకు ఉదయం 9 గంటల ఉంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ శివాజీ తెలిపారు. ఈ మేరకు శనివారం రాత్రి ఆయన ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. పూళ్ల, ఎంఎంపురం ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని స్పష్టం చేశారు. విద్యుత్ అంతరాయం నేపథ్యంలో ప్రజలు సహకరించాలని కోరారు.

### సాగు భూములకు పట్టాలివ్వాలి

**జంగారెడ్డిగూడెం:** పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైసన్నగూడెం గ్రామంలో సర్వే నెంబర్ 120/2లో పేదలు సాగు చేస్తున్న భూమిని ఆయన జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కొన్నేళ్లుగా మామిడి, జీడి, జామాయిల్ తదితర పంటలు సాగు చేసుకుంటున్నా పేదలను గ్రామాల్లో ఉన్నటువంటి భూస్వాములు, అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

# పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచాలి



భీమడోలు: పాతూరు పాఠశాలలో వండిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 భాస్కర్‌కుమార్



దెందులూరు: ప్రధానోపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎంఈఓ వరప్రసాద్

**భీమడోలు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ పెంచకుంటే పాఠశాలల మనుగడకు ముప్పు వాటిల్లుతుందని భీమడోలు ఎంఈఓ-2 అయినపర్తి భాస్కరకుమార్ అన్నారు. సూరప్పగూడెం పంచాయతీ పరిధిలోని పాతూరు ప్రాథమిక పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేవారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. హెచ్‌ఎం కె.రఘురామరాజు, టీచర్ మండే సుధాకర్‌లకు పలు సూచలనందించారు. ప్రత్యేక ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తొలుత డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా తయారుచేసి ఆహార పదార్థాలను ఆయన రుచిచూసి, నిర్వాహకులకు పలుసూచనలు చేశారు.

**దెందులూరులో..**

**దెందులూరు:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్లు ఎక్కువ జరిగేలా సంబంధిత గ్రామాల పరిధిలో ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో కృషి చేయాలని దెందులూరు మండల విద్యాశాఖ అధికారి ఆకెళ్ళ వెంకట నాగ వరప్రసాద్ అన్నారు. దెందులూరు మండల విద్యాశాఖ కార్యాలయంలో మండలంలోని చల్లచింతలపూడి, పోతునూరు, కొవ్వలి పలు గ్రామాల ప్రధానోపాధ్యాయులతో విద్యార్థుల నమోదు పెంచడంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి బయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించుకోవాలని ఆధార్ లేకపోయినా బడి పిల్లలను బయట ఉంచకుండా పాఠశాలలో చేర్పించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో కొవ్వలి జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం శర్మ, గోపన్నపాలెం ఉపాధ్యాయుడు సత్యనారాయణ, పోతునూరు హైస్కూల్ హెచ్‌ఎం జయశంకర్, దెందులూరు బాలికొన్నతో పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోడౌన్ తనిఖీ



ఈవీఎం గోడౌన్ వద్ద తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

**ఏలూరు(మెట్రో):** స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల గోడౌన్‌ను శనివారం కలెక్టర్ కె.వెట్రిసెల్వి తనిఖీ చేశారు. ఈవీఎం గోడౌన్‌కు వేసిన భద్రతా సీళ్లు, సీసీ కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు మొదలైన వాటిని రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆమె పరిశీలించారు. రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌ఓ వి.విశ్వేశ్వరరావు, కలెక్టరేట్ సూపరింటెండెంట్ చల్లన్న దొర, రాజకీయ పార్టీల ప్రతినిధులు యు.బాలానందం (టీడీపీ), ఎ.రతన్ కాంత్ (బీఎస్పీ), నెరుసు నెలరాజు (బీజేపీ), పి.ఆదిశేషు (సీపీఎం), ఎస్ బాబుప్రసాద్, (ఐఎన్‌సీ), వి.స్టాన్లీబాబు (వైఎస్సార్ సీపీ), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది రాధాకృష్ణ, తదితరులు ఉన్నారు.

# పీజీ విద్యార్థుల రక్తదానం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రసాద్

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** స్థానిక సీఆర్‌ఆర్ పీజీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన శిబిరంలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ ఎంబీఎస్‌వీ ప్రసాద్ తెలిపారు. ప్రతి సంవత్సరం సీఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు పెద్ద ఎత్తున రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో ఏలూరు జిల్లాలో ఉన్న కళాశాలల్లో రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నామని, సేకరించిన రక్త యూనిట్లను తల సేమియా, సికిల్ సెల్ ఎనీమియా, డయాలసిస్ బాధితులు, గర్భిణులు తదితరులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. రక్తదానం చేసిన యువకులను అభినందించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కే వరప్రసాదరావు, పీఆర్‌ఓ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

# అతిసార వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ముప్పు



సరిపల్లి ఆరోగ్య కేంద్రంలో అతిసార వ్యాధి నివారణ అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**కొయ్యలగూడెం:** డయేరియాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ఆరోగ్య కేంద్రాల్లో అమలు చేస్తున్నట్లు ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. బయ్యనగూడెం పీహెచ్‌సీ పరిధిలోని సరిపల్లి ఆరోగ్య కేంద్రంలో గ్రామస్తులకు డయేరియా లక్షణాలు, సత్వర చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మలేరియా, డయేరియాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మూడు లేదా అంత కంటే ఎక్కువ సార్లు నీళ్ల విరోచనాలు అయితే అది అతిసార వ్యాధి అని, ఐదేళ్లలోపు చిన్నారుల్లో అతిసార వ్యాధిని అశ్రద్ధ చేస్తే ప్రాణాలకే ప్రమాదం అని హెచ్చరించారు. అతిసారా వ్యాధిపట్ల తక్షణ వైద్యం పొందాలన్నారు. కలుషితమైన నీరు, కలుషిత ఆహారం ద్వారా ఈ వ్యాధి వస్తుందని, ఈ వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని గాని క్లోరినేషన్ చేసిన మంచినీరు మాత్రమే వాడాలన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, మాంసాలు తినరాదని, ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండా చూసుకోవాలని, మూతలు వేసుకోవాలని తెలిపారు. నీళ్ల విరోచనాలు అయితే ఒంట్లో ఉన్న ఖనిజ లవణాలు బయటకు పోయి శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుందని, ఓఆర్‌ఎస్ ద్రావణాన్ని ఒక లీటర్ మంచి నీటిలో కలిపి తాగితే ప్రాణాపాయం ఉండదని అవగాహన కలిగించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీ కె.విమలదేవి, ఏఎన్‌ఎం కె.గంగాదేవి, ఆశాలు కె.వెంకటలక్ష్మి, ఎమ్.వరలక్ష్మి పాల్గొన్నారు.

### చిన్న, మధ్య తరహా పరిశ్రమలే కీలకం

**ఏలూరు (ఆర్‌ఆర్‌పేట):** చిన్న, మధ్య తరహా పరిశ్రమలు భారత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలా నిలుస్తున్నాయని సెయింట్ థెరిస్సా మహిళా స్వయంప్రతిపత్తి కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అన్నారు. కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ చిన్న, మధ్యతరగతి పరిశ్రమల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చిన్న మధ్య తరగతి పరిశ్రమలు కీలక పాత్ర పోషిస్తున్నాయని, ఉద్యోగాల కల్పన, ప్రాంతీయ అభివృద్ధి, నూతన ఆవిష్కరణకు ఇది ప్రధాన ఆధారంగా నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. నిర్వాహకులు మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి పి.విజయలక్ష్మి, అధ్యాపకులు హెప్సిబాను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ సునీల రాణి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ సిస్టర్ సుశీల, తదితరులు అభినందించారు.

# ప్రోత్సాహక బహుమతుల అందజేత



విద్యార్థినికి ప్రోత్సాహక బహుమతి అందజేస్తున్న వారధి ట్రస్ట్ సభ్యులు

**జంగారెడ్డిగూడెం:** పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపి పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థిని లీలా నూకరత్నంకు రూ.10,116, ద్వితీయ స్థానం సాధించిన వెంకట నాగవైష్ణవికి రూ.5,116 వారధి ట్రస్ట్ సభ్యులు అందజేశారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో వారధి ట్రస్ట్ వ్యవస్థాపకులు వలవల తాతాజీ మాట్లాడుతూ విద్యార్థినులు మరిన్ని విజయాలు సాధించాలనే ఉద్దేశ్యంతో దాతల సహకారంతో ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు చెప్పారు. హైదరాబాద్‌కు చెందిన కుర్రు భరత్, జ్యోత్స్న బిందు దంపతుల వితరణతో ఈ కార్యక్రమం జరిగిందన్నారు. వారధి ట్రస్ట్ ప్రతినిధులు మద్దిపాటి శ్రీను, వెలిచెర్ల ఆనంద్, పాఠశాల హెచ్‌ఎం గ్లోరీ ప్రశాంతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ మండల కార్యదర్శి

**కుక్కునూరు:** కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ ప్రభుత్వాని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో కుంజ నాగలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలోని పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం మోడీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్ తెచ్చిందన్నారు. లేబర్ కోడ్స్ వల్ల పని ప్రదేశంలో కార్మికులకు రక్షణ, ఆరోగ్య భద్రత, పని గంటలు, వారాంతపు సెలవులు తదితర హక్కులను కోల్పోతారన్నారు. ఇటీవల రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో 8 గంటల పని దినాన్ని 10 గంటలకు మారుస్తూ ఏకపక్షంగా నిర్ణయించారని, అనేక సంవత్సరాల నుంచి రాష్ట్రంలో ప్రభుత్వాలు కనీస వేతనాలు రూపాయి కూడా పెంచలేదని విమర్శించారు. కార్మిక చట్టాలకు వ్యతిరేకంగా, డిమాండ్ల పరిష్కారానికై జూలై 9న నిర్వహిస్తున్న సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# దళితుల ఇళ్లపై యమపాశాలు



విద్యుత్ వైర్లను చూపిస్తున్న దళిత సంఘాల నాయకులు

**బుట్టాయగూడెం:** బుట్టాయగూడెం రాజీవ్ నగర్ కాలనీలోని దళితుల ఇళ్లపై 11 కేవీ కరెంట్ వైర్లు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయి. చాలా కాలంగా ఈ వైర్లు వేలాడుతూ ఉన్నాయని, వీటిని తొలగించాలని అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇటీవల తీగలు తొలగించకుండా కేవలం ప్లాస్టిక్ పైపులు వేశారని తెలిపారు. వర్షాకాలంలో ఈ విద్యుత్ తీగల పట్ల స్థానికులు భయాందోళనల చెందుతున్నారు. రాజీవ్‌నగర్ కాలనీవాసులకు ఎటువంటి ప్రమాదం జరగకుముందే అధికారులు ఇళ్లపై ఉన్న 11కేవీ కరెంట్ వైర్లను తొలగించాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు అందుగుల ఫ్రాన్సిస్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుడు కోరం దుర్గారావు కోరుతున్నారు.

# మహిళా పోలీస్‌స్టేషన్ భవనం ముస్తాబు



జిల్లా పోలీస్ కార్యాలయ సమీపంలో మహిళా పోలీస్‌స్టేషన్ భవనం




ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ వద్ద క్రాస్‌రోడ్స్ పేరుతో పార్కు నిర్మాణం

**ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద పార్కు నిర్మాణం**

**ఏలూరు టౌన్:** ఏలూరు జిల్లా కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏలూరు నగరంలో ప్రత్యేకంగా జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం వేగంగా సాగుతోంది. మరోవైపు పోలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు నిర్మాణం పూర్తయింది. ఏలూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఆహ్లాదకరంగా పార్కును ముస్తాబు చేశారు. ఇవన్నీ ఒకేసారి పోలీస్ బాస్‌తో ప్రారంభించేందుకు పోలీస్ ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయ సమీపంలో గత ప్రభుత్వం హయాంలో జిల్లా మహిళా పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం ప్రారంభించారు. సుమారు రూ.1 కోటి పైగా నిధులతో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలతో, ఫిర్యాదుదారులకు మెరుగైన వసతులతో ఈ భవనాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఏలూరు కోటదిబ్బ తహసీల్దార్ కార్యాలయం పక్కన మహిళా పోలీస్‌స్టేషన్ ఉంది.

**ఆహ్లాదకరంగా పార్కు**

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సమీపంలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కనే ఆహ్లాదకరంగా పార్కును అభివృద్ధి చేశారు. క్రాస్ రోడ్స్ పేరుతో పిల్లలకు ఆట వస్తువులు, ఎస్పీ కార్యాలయానికి వచ్చే ఫిర్యాదుదారులు సేదదీరేందుకు అనువుగా చెట్లతో, మొక్కలతో తీర్చిదిద్దుతున్నారు. ఈ పార్కును సుమారుగా రూ.40 లక్షల వ్యయంతో అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. పార్కు మధ్యలోనే చెట్లు ఉండడం, రకరకాల మొక్కలు నాటటంతో ఆహ్లాదకరంగా మారింది.

**పోలీస్ పెట్రోల్ బంక్**

ఏలూరు జిల్లా పోలీస్ సంక్షేమ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో అమీనాపేట పోలీస్ కల్యాణ మండపం పక్కనే పోలీస్ పెట్రోల్ బంకు ఏర్పాటు చేశారు. ఇప్పటికే శాంతినగర్ సీఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్ ఎదురుగా పోలీస్ పెట్రోల్ బంకు ఉండగా, మరో బంకును ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. పోలీస్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో ఇప్పటికే సబ్సిడీ క్యాంటీన్, పోలీస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్, ఏసీ కల్యాణ మండపం, జిమ్, గ్యాస్ సిలిండర్ ఏజెన్సీలు సైతం పనిచేస్తున్నాయి. జిల్లాలోని పోలీస్ శాఖలో పనిచేస్తోన్న సిబ్బంది సంక్షేమానికి ఇవన్నీ ఏర్పాటు చేశారు.